క్లుప్తంగా

వైఎస్సార్ బీమా సాయం పంపిణీ



మృతురాలి సోదరుడికి తక్షణ సాయం అందజేస్తున్న సర్పంచ్ సరోజమ్మ

ప్యాపిలి: మండల పరిధిలోని చంద్రపల్లి గ్రామానికి చెందిన లక్ష్మీదేవి శనివారం అనారోగ్యంతో మృతి చెందింది. ఈ మేరకు వైఎస్సార్ బీమా తక్షణ సాయం రూ. 10 వేలను సర్పంచ్ జొన్నగిరి సరోజమ్మ ఆదివారం మృతురాలి సోదరుడికి అందజేశారు. సర్పంచ్ మాట్లాడుతూ లక్ష్మీదేవి మృతి చెందిన 24 గంటల్లోనే ప్రభుత్వం తక్షణ సాయంగా రూ.10 వేలు మంజూరు చేసిందన్నారు. మిగిలిన రూ. 90 వేలు త్వరలో మంజూరవుతాయన్నారు.

సైనిక్ స్కూలుకు ఎంపికైన బేతంచెర్ల విద్యార్థి

బేతంచెర్ల: పట్టణానికి చెందిన జడల వివేక్ అనే 6వ తరగతి విద్యార్థి సైనిక్ స్కూలుకు ఎంపికైనట్లు సుమేధా ఇంగ్లిష్ మీడియం హైస్కూల్ కరస్పాండెంట్ విజయ నాగారాజు ఆదివారం తెలిపారు. కర్నూలులో జనవరి 8న జరిగిన ఆలిండియా సైనిక్ స్కూల్ ఎంట్రెన్స్‌లో 300 మార్కులకు గాను 238 మార్కులు సాధించి 6005 ర్యాంకు సాధించాడన్నారు. ఈ మేరకు తమిళనాడులోని వికాస సైనిక పాఠశాలకు వివేక్ ఎంపికయ్యాడని తెలిపారు.

ఆసుపత్రిలో రొట్టె, గుడ్డు పంపిణీ

డోన్ టౌన్: స్థానిక ప్రభుత్వ ఆసుపత్రిలో రోగులకు రొట్టె,పప్పు, గుడ్డు ఆదివారం ప్రార్థన సమయం మినిస్ట్రీస్ నిర్వాహకుడు జాన్ ప్రభాకర్ పంపిణీ చేశారు. కార్యక్రమంలో మినిస్ట్రీస్ సభ్యులు ఎల్లయ్య, హోసన్నా వృద్ధాశ్రమం సూపర్ వైజర్ భారతిలు పాల్గొన్నారు.

విద్యాదీవెనతో 1272 మందికి లబ్ధి

కొలిమిగుండ్ల: జగనన్న విద్యాదీవెన పథకంతో మండలంలోని 16 గ్రామ సచివాలయాల పరిధిలో 1272 మంది విద్యార్థులకు లబ్ధి చేకూరింది. అక్టోబర్‌–డిసెంబర్ 2022 త్రైమాసికానికి సంబంధించి ఆదివారం సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఎన్టీఆర్ జిల్లా తిరువూరులో బటన్ నొక్కి విద్యార్థుల తల్లుల ఖాతాల్లో నగదు జమ చేశారు. ఐటీఐ, పాలిటెక్నిక్,డిగ్రీ, ఇంజినీరింగ్, మెడిసిన్ తదితర కోర్సులు చదివే పేద విద్యార్థుల కోసం నేరుగా తల్లుల ఖాతాల్లోనే నగదు జమ చేస్తున్నారు. ఐటీఐ విద్యార్థులకు రూ.10వేలు, పాలిటెక్నిక్ విద్యార్థులకు రూ.15వేలు, డిగ్రీ, ఇంజినీరింగ్, మెడిసిన్ తదితర కోర్సుల విద్యార్థులకు రూ.20 వేల చొప్పున ఏటా రెండు వాయిదాల్లో ప్రభుత్వం అందిస్తుంది. పేద విద్యార్థుల కోసం గతంలో ఎవరూ చేయనిరీతిలో ఆదుకుంటుండడంతో విద్యార్థులతోపాటు తల్లితండ్రులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

గ్రావెల్ రోడ్డు పనుల పరిశీలన



రోడ్డు పనులను పరిశీలిస్తున్న శ్రీరాములు

బేతంచెర్ల: మండల పరిధిలోని గూటుపల్లె గ్రామంలో రూ.15 లక్షల డీఎంఎఫ్ నిధులతో డ్రైనేజీ కాల్వలు ఏర్పాటు చేశారు. వీధులు సౌకర్యంగా ఉంచేందుకు ఏర్పాటు చేస్తున్న గ్రావెల్ రోడ్డు పనులను ఆదివారం సర్పంచ్ కోడెల శ్రీరాములు పరిశీలించారు. గ్రామంలో ప్రాధాన్యత మేరకు దశలవారీగా అభివృద్ధి పనులు చేపడుతున్నామని సర్పంచ్ తెలిపారు.

యుద్ధప్రాతిపాదికన తాగునీటి పైప్‌లైన్ పనులు

బేతంచెర్ల: స్థానిక బనగానపల్లె రహదారిలో కస్తూర్బా విద్యాలయం వరకు చేపట్టిన రహదారి విస్తరణ పనులతో సంజీవనగర్ కాలనీకి సరఫరా అయ్యే తాగునీటి పైపులైన్‌లు దెబ్బతిన్నాయి. దీంతో తాగునీటి సమస్య తలెత్తగా నగర పంచాయతీ చైర్మన్ చలం రెడ్డి, కమిషనర్ రమేష్ బాబు ట్యాంకర్ల ద్వారా నీటిని సరఫరా చేయిస్తున్నారు. అదేవిధంగా దెబ్బతిన్న పైప్‌లైన్‌ల స్థానంలో ఆదివారం యుద్ధప్రాతిపదికన పనులు చేపట్టారు.

వ్యవసాయానికి విద్యుత్ సరఫరా వేళలు

కోవెలకుంట్ల: మండలంలోని ఫీడర్ల పరిధిలో సోమవారం నుంచి వ్యవసాయ రంగానికి పగటి వేళల్లో తొమ్మిది గంటల విద్యుత్ సరఫరా చేస్తున్నట్లు ఏఈ రామసుబ్రహ్మణ్యం చెప్పారు. కోవెలకుంట్ల, గుళ్లదూర్తి, కలుగొట్ల విద్యుత్ సబ్‌స్టేషన్ల ఫీడర్ల పరిధిలో విద్యుత్ సరఫరా వేళలను తెలియజేశారు. జోళదరాశి, భీమునిపాడు, అమడాల, గుంజలపాడు, గుళ్లదూర్తి, పొట్టిపాడు, హరివరం, కొత్తపల్లె, అల్లూరు, రేవనూరు, కలుగొట్ల, కొప్పెర్ల ఫీడర్ల పరిధిలోని గ్రామాల్లో ఉదయం 8 నుంచి సాయంత్రం 5 గంటల వరకు విద్యుత్ సరఫరా ఉంటుందని వివరించారు.

సేవలు సులువు !

ప్రజాసేవ కేంద్రాలుగా 'సచివాలయాలు'

- అర్హతే ప్రామాణికంగా సంక్షేమ పథకాల వర్తింపు
- బహిరంగంగా లబ్ధిదారుల జాబితా ప్రదర్శన
- స్వగ్రామంలోనే పరిష్కారమవుతున్న సమస్యలు
- రోజురోజుకూ పెరుగుతున్న ప్రజల ఆదరణ



అవుకు: వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా తీసుకొచ్చిన సచివాలయ, వలంటీర్ వ్యవస్థలు అందరి మన్ననలు పొందుతున్నాయి. ప్రతి గ్రామంలో సచివాలయ భవనాలు నిర్మించడంతో పల్లెల్లో పట్టణ శోభ సంతరించుకుంది. జాతిపిత కలలుగన్న గ్రామస్వరాజ్య స్థాపనే లక్ష్యంగా తీసుకొచ్చిన సచివాలయాలతో ప్రభుత్వ సేవలు సులువయ్యాయి. ప్రజలకు గ్రామ, వార్డు సచివాలయాల ద్వారా నిష్పక్షపాతంగా సేవలను అందుతుండడంతో రోజురోజుకు ప్రజాదరణ పెరుగుతోంది. కుల, మత, పార్టీ, వర్గాలు తేడాలు లేకుండా అర్హతనే ప్రామాణికంగా పేదవాడికి లబ్ధి చేకూరుస్తున్న తీరును ప్రతిఒక్కరూ అభినందిస్తున్నారు. బనగానపల్లె నియోజవర్గంలో 82 వార్డు, గ్రామ సచివాలయాలు ఉండగా 669 ఉద్యోగులు ప్రజలకు సేవలందిస్తున్నారు. సంక్షేమ పథకాల లబ్ధిదారుల వివరాలను బహిరంగంగా సచివాలయాల నోటీస్ బోర్డులో ఉంచుతున్నారు. లబ్ధి చేకూరని దరఖాస్తుదారులకు ఎందుకు సంక్షేమ పథకాలు వర్తించలేదన్న సచివాలయ ఉద్యోగుల వివరణను నిరక్షరాస్యులు సైతం మెచ్చుకుంటున్నారు. ఆయా పథకాలకు దరఖాస్తులో చేసిన తప్పిదాలను సవరించుకుంటున్నారు కూడా. అదేవిధంగా ప్రభుత్వ పథకాలపై అవగాహన కలిస్తుండడంతో ప్రతిఒక్కరూ సంతోషం వ్యక్తం చేస్తున్నారు.



అవుకు-2 సచివాలయ లబ్ధిదారుల వివరాల జాబితాను ప్రదర్శించిన దృశ్యం

సచివాలయాలకు వెళ్తే చాలు..

ప్రభుత్వ సంక్షేమ పథకాల అమలులో పారదర్శకతకు గ్రామ, వార్డు సచివాలయాలు చిరునామాగా నిలుస్తున్నాయి. సంక్షేమ పథకాల వివరాలు,..దరఖాస్తు ఏలా చేసుకోవాలి...వాటికి అర్హత ఏంటి... తదితర విషయాలు సచివాలయాలకు వెళ్తే ఇట్టే తెలిసిపోతున్నాయి. సంక్షేమ పథకాలు లబ్ధిపొందిన వారి వివరాలను గ్రామ, వార్డు సచివాలయ నోటీస్ బోర్డుల్లో అతికించడమే కాకుండా ప్రజల సందేహాలను నివృత్తి చేసే వేదికలుగా సచివాలయాలు మారుతున్నాయి. సచివాలయాల్లో పంచాయతీ సెక్రటరీ, వీఆర్‌ఓ, ఇంజినీర్ అసిస్టెంట్, డిజిటల్ అసిస్టెంట్, వెల్ఫేర్ అసిస్టెంట్, ఏఎన్‌ఎం, వెటర్నరీ అసిస్టెంట్, అగ్రికల్చర్ అసిస్టెంట్, జూనియర్ లైన్‌మెన్ తదితర ఉద్యోగులు ప్రజలకు అందుబాటులో ఉంటూ సేవలు అందజేస్తున్నారు.

నియోజకవర్గంలో సచివాలయాలు, ఉద్యోగుల వివరాలు..

మండలం	సచివాలయాలు	ఉద్యోగులు
బనగానపల్లె	25	212
అవుకు	18	152
కోవెలకుంట్ల	12	81
కొలిమిగుండ్ల	16	142
సంజామల	11	82

సకల సేవలు అందుబాటులో....

సచివాలయాల్లో పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి ,ఆర్‌డబ్ల్యూస్, సెర్ఫ్ శాఖలు, సంక్షేమం, వెనుకబడిన తరగతుల, మైనార్టీ, గిరిజన, వికాలాంగుల, సాంఘిక సంక్షేమ శాఖలు, రెవెన్యూ, గృహ నిర్మాణ, వ్యవసాయ, పశుసంవర్ధక, మత్స్యశాఖలు, విద్యా, సాంకేతిక విద్య, వైద్య, ఆరోగ్య శాఖలు, కార్మిక, పరిశ్రమ,జౌలి, శాంతిభద్రతలు, న్యాయ శాఖలు, రవాణా, పర్యాటక, యువజన, క్రీడా, విద్యుత్ తదితర శాఖాలకు సంబంధించిన సేవలు అందుతున్నాయి. అదేవిధంగా జనన, మరణ నమోదు, మ్యూటేషన్ సర్టిఫికేట్, వాణిజ్య, లైసెన్, ఆస్థి విలువ, కుల, నివాస, ఆదాయ ధ్రువీకరణ పత్రాలతోపాటు టైటిల్ డీడ్ కమ్ పాస్‌బుక్ జారీ, అడంగల్, 1బీలో సర్వేనంబరు చేర్చుట తదితర సేవలు స్వగ్రామంలోనే అందుతున్నాయి. సచివాలయాల్లో ఆరువందలకుపైగా వివిధరకాల సేవలు అందుతున్నట్లు అధికారులు పేర్కొంటున్నారు.

తప్పిన ఇబ్బందులు

గతంలో ఏ ధ్రువ పత్రం కావాలన్నా మండల కేంద్రాలకు వెళ్లాల్సి వచ్చేది. కనీసం కుల ధ్రువీకరణ పత్రం కావాలన్నా ఇబ్బందులు తప్పని పరిస్థితి. రోజుల తరబడి నిరీక్షించాల్సిన పరిస్థితి. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం తీసుకొచ్చిన సచివాలయ వ్యవస్థతో ఆ ఇబ్బందులన్నీ తప్పాయి. అన్ని సేవలు సచివాయాల్లో లభిస్తుండడంతో ప్రజలు సంతోషం వ్యక్తం చేస్తున్నారు.

మండల కేంద్రాలకు రానవసరం లేదు..



ప్రభుత్వ సంక్షేమ పథకాల వివరాల కోసం, ప్రభుత్వ సేవల కోసం ప్రజలు మండల కేంద్రాలకు రానవసరంలేదు. ఆయా గ్రామాల సచివాలయాల్లోకి వెళ్తే లబ్ధిదారుల వివరాలతో పాటు అన్ని సమాచారాలు తెలుస్తాయి. సందేహాలు కూడా అక్కడే నివృత్తి అవుతాయి. అలాగే అర్హతలు ఉంటే అన్ని పనులు చేసేలా సచివాలయ ఉద్యోగులకు ఆదేశాలు ఇస్తున్నాం. ప్రజలు డబ్బు, సమయాన్ని వృథా చేసుకోకుండా ఆయా గ్రామ సచివాలయాల్లోనే అన్ని సేవలను సద్వినియోగం చేసుకోండి.

–అవుకు మండల ఎంపీడీఓ అజాంఖాన్

సమగ్ర సమాచారం గోడలకు అతికిస్తున్నాం..



ప్రభుత్వ సంక్షేమ పథకాలకు సంబంధించిన సమగ్ర సమాచారాన్ని సచివాలయాల నోటీసు బోర్డుల్లో ఉంచుతున్నాం. లబ్ధిదారులకు అర్థమయ్యేలా ఏయే సంక్షేమ పథకం పొందారో పూర్తి వివరాలను అందులో పొందుపరుస్తున్నాం. తెలియని వారికి మేమే పూర్తి వివరాలను చదివి వినిపిస్తున్నాం. అంతేకాకుండా కొన్ని శాఖలకు సంబందించిన టోల్ ఫ్రీ నెంబర్లను కూడా ఉంచాం. వలంటీర్లు కూడా అన్నింటిపై ప్రజలకు అవగామన కల్పించేలా చర్యలు తీసుకుంటున్నాం.

–అవుకు–2 సచివాలయ సెక్రటరీ హరిప్రతాప్ రెడ్డి

సచివాలయ సేవలు అభినందనీయం



నాది అవుకు మండలం కునుకుంట్ల గ్రామం. ఇటీవలే నా భర్తకు కిడ్నీ సమస్య వచ్చింది. విషయాన్ని వలంటీర్లు గుర్తించి కిడ్నీ పేషంట్లకు ప్రభుత్వం నెలకు రూ.10వేలు ఆర్థిక సహాయాన్ని అందిస్తున్నదని వివరించారు. పేషంట్‌కు సంబంధించిన అన్ని పత్రాలను పరిశీలించి వారే దరఖాస్తు చేయించారు. దీంతో ఈనెల ప్రారంభం నుంచే నా భర్తకు రూ.10వేలు పింఛన్ అందదుతుందన్నారు. సచివాలయ సేవలు అభినందనీయం.

– గంగారి నాగలక్ష్మమ్మ కునుకుంట్ల గ్రామం

ప్రతిఒక్కరూ సంప్రదాయాలను పాటించాలి



త్రైతసిద్ధాంత క్యాలెండర్‌ను ఆవిష్కరిస్తున్న ఎంపీపీ చల్లా రాజశేఖర్ రెడ్డి

అవుకు: మన దేశం సంస్కృతి, సంప్రదాయాలకు పెట్టిందిపేరని, వాటిని ప్రతిఒక్కరూ పాటించాలని ఎంపీపీ చల్లా రాజశేఖర్ రెడ్డి సూచించారు. మండల కేంద్రం అవుకులోని చల్లా భవన్ వద్ద ఎంపీపీతో పాటు అవుకు సొసైటీ అధ్యక్షుడు చల్లా విజయభాస్కర్ రెడ్డి, వైఎస్సార్‌సీపీ నాయకులు చల్లా విగ్నేశ్వర్ రెడ్డి, దుగ్గిరెడ్డి రవీంద్రనాథ్ రెడ్డి, చల్లా విక్రాంత్ రెడ్డి,పోతిరెడ్డి శ్రీనివాసరెడ్డిలు త్రైతసిద్ధాంత తెలుగు క్యాలెండర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఎంపీపీ మాట్లాడుతూ తెలుగు కాలసూచికలో ఎన్నో భగవద్గీత వచనాలను జోడించి, ప్రతిఒక్కరికీ అర్థమయ్యే విధంగా రూపొందించారన్నారు. అంతేకాకుండా దేవాలయ సంప్రదాయాల్లో ఆత్మజ్ఞానం, తెలుగు పండుగలు, నెలల విశిష్టత, త్రైతసిద్ధాంత భగవద్గీత శ్లోకాలను ఈ క్యాలెండర్‌లో పొందుపరచటం సంతోషకరమని తెలిపారు. కార్యక్రమంలో త్రైతసిద్ధాంత ప్రబోధ సేవాసమితి ఇందూజ్ఞాన వేదిక అవుకు మండల కమిటీ సభ్యులు నరేంద్ర, జయ నాగేంద్ర ప్రసాద్, చంద్రమోహన్, జయ ప్రసాద్, శ్రీనివాసులు, ప్రసాద్ పాల్గొన్నారు.

మల్లు స్వరాజ్యం వర్ధంతి

డోన్ టౌన్: తెలంగాణ సాయుధ రైతాంగ పోరాట యోధురాలు మల్లు స్వరాజ్యం ప్రథమ వర్ధంతిని ఆదివారం సీపీఎం నాయకులు ఘనంగా నిర్వహించుకున్నారు. స్థానిక కార్యాలయంలో నాయకులు ఆమె చిత్ర పటానికి పూల మాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. సీనియర్ నాయకులు కొండన్న, శివరాంలు, సీపీఎం పట్టణ కార్యదర్శి నక్కిశ్రీకాంత్, బిల్డింగ్ వర్కర్స్ యూనియన్ జిల్లా అధ్యక్షుడు చిన్న రహిమాన్, సీఐటీయూ మండల అధ్యక్షుడు రామాంజనేయులు మల్లు స్వరాజ్యం త్యాగాలను గుర్తు చేశారు సూర్యాపేట జిల్లా, తుంగతుర్తి గ్రామంలో బడా భూస్వామి కుటుంబంలో జన్మించిన ఆమె బడుగు బలహీన వర్గాల కోసం నైజాం సర్కార్ నియంతృత్వానికి వ్యతిరేకంగా సాగుతున్న తెలంగాణ సాయుధ రైతాంగ పోరాటంలో 13 ఏళ్లలోనే తుపాకి చేతబూనిని వీర వనిత అని కొనియాడారు.

ఆధ్యాత్మికం

మారెమ్మకు ప్రత్యేక పూజలు



కోవెలకుంట్ల: స్థానిక అంకాలమ్మ చౌరస్తాలో వెలసిన మారెమ్మ ఆలయంలో ఆదివారం భక్తులు భక్తిశ్రద్ధలతో ప్రత్యేక పూజలు నిర్వహించారు. పురాతన ఆలయం శిథిలావస్థకు చేరుకోవడంతో దాతల సహకారంతో ఇటీవల పునర్నిర్మించారు. ఆలయ ప్రతిష్ఠగావించి 40 రోజులు పూర్తి కావడంతో కమిటీ ఆధ్వర్యంలో ప్రత్యేక పూజా కార్యక్రమాలు చేపట్టారు. భక్తులు అమ్మవారిని దర్శించుకుని మొక్కులు తీర్చుకున్నారు. అనంతరం భక్తులకు అన్నదాన కార్యక్రమం చేపట్టారు.

కుంటెమ్మ ఆలయంలో ప్రత్యేక పూజలు



కలశం పూజలో పాల్గొన్న గ్రామపెద్దలు

కొలిమిగుండ్ల: మండల కేంద్రం కొలిమిగుండ్ల ఎస్సీ కాలనీలోని కుంటెమ్మ ఆలయం జీర్ణోద్ధరణ పనులు పూర్తి కావడంతో ఆదివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. సర్పంచ్ జినుగు శివరాముడు ఆలయ జీర్ణోద్ధరణకు రూ.3లక్షలకుపైగా వెచ్చించారు. గ్రామ పెద్దల ఆధ్వర్యంలో వేదపండితులు ఆలూరి రాఘవేంద్రప్రసాద్, నరసింహప్రసాద్ అమ్మవారికి విశేష పూజలు నిర్వహించారు. 108 టెంకాయలు కొట్టిన అనంతరం వేదమంత్రోచ్చారణల మధ్య ఆలయ గర్భగుడిపైన కలశాన్ని ప్రతిష్ఠించారు. ఈసందర్భంగా భారీ కేక్‌ను కట్ చేశారు. ఈసందర్భంగా గ్రామ పెద్దలతో పాటు వైఎస్సార్‌సీపీ నాయకులను సర్పంచ్ సన్మానించారు. కార్యక్రమంలో గ్రామపెద్దలు పేరం సూర్యనారాయణరెడ్డి, చంద్రశేఖర్, కృష్ణమూర్తి, వైఎస్సార్‌సీపీ జిల్లా ప్రచార కార్యదర్శి పేరం సత్యనారాయణ రెడ్డి, జిల్లా సర్పంచ్‌ల సంఘం అధ్యక్షుడు లాయర్ మహేశ్వరరెడ్డి, మాజీ ఎంపీపీ రామాంజనేయులు, ఎంపీటీసీ సభ్యుడు వెంకట రమణ, నాయకులు పేరం ఆదినారాయణరెడ్డి, నందకిషోర్‌రెడ్డి, రఘునాథరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

యాగంటి, నందవరం క్షేత్రాలను దర్శించుకున్న జడ్జి



శ్రీ చౌడేశ్వరిదేవి ఆలయంలో అమ్మవారి ప్రసాదం స్వీకరిస్తున్న జిల్లా జడ్జి ఎస్ శ్రీనివాసరావు

బనగానపల్లెరూరల్: మండలంలోని యాగంటి క్షేత్రంలో వెలసిన శ్రీ ఉమామహేశ్వర స్వామి, నందవరం గ్రామంలో వెలసిన శ్రీచౌడేశ్వరిదేవి అమ్మవారి ఆలయాన్ని కర్నూలు జిల్లా జడ్జి ఎస్ శ్రీనివాసరావు దంపతుల ఆదివారం దర్శించుకున్నారు. జడ్జి దంపతులకు ఆయా ఆలయాల ఈఓలు చంద్రశేఖర్‌రెడ్డి, రామానుజన్‌ల ఆధ్వర్యంలో పూర్ణకుంభంతో ఘనస్వాగతం పలికారు. అనంతరం శ్రీ శివపార్వతులకు, శ్రీ చౌడేశ్వరీ దేవికి ప్రత్యేక పూజలు చేసి తీర్థప్రసాదం స్వీకరించారు. తదనంతరం జడ్జి దంపతులను అర్చకులు పూలమాలలు, దుశ్శాలతో సత్కరించారు.

నేడు శ్రీ చౌడేశ్వరిదేవి జ్యోతి మహోత్సవాలపై సమీక్ష

బనగానపల్లెరూరల్: మండలంలోని నందవరం గ్రామంలోని శ్రీ చౌడేశ్వరిదేవి ఆలయంలో ఈ నెల 22వ తేదీ నుంచి ప్రారంభమయ్యే శ్రీ చౌడేశ్వరిదేవి రాయభారాద జ్యోతి, రథ వసంతోత్సవంపై సోమవారం వివిధ శాఖల అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహిస్తున్నట్లు ఆలయ కార్యనిర్వాహణాధికారి రామానుజన్ ఆదివారం తెలిపారు. సమావేశానికి ముఖ్య అతిథిగా ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి హాజరవుతారని, ఉత్సవాల నిర్వహణ తీరుపై అధికారులతో చర్చిస్తారన్నారు. ఉదయం 10గంటలకు జరుగే రివ్యూకు వివిధ శాఖల అధికారులు తప్పనిసరిగా హాజరు కావాలని ఈఓ సూచించారు.

నష్టపోయిన రైతులను ఆదుకుంటాం

- ప్రతి ఎకరాకు పరిహారం అందజేస్తాం
- వర్షంతో దెబ్బతిన్న పంటలను పరిశీలించిన ఎమ్మెల్యే కాటసాని
- పంటనష్ట సర్వేను పకడ్బందీగా చేపట్టాలని ఆదేశం



పొట్టిపాడు వద్ద భారీ వర్షంతో రాలిపోయిన మిరప దిగుబడులను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే కాటసాని

కోవెలకుంట్ల: అకాల వర్షంతో పంటనష్టం జరిగిన రైతులను అన్నివిధాలా ఆదుకుంటామని, నష్టం జరిగిన ప్రతి ఎకరాకు నష్టపరిహారం అందజేస్తామని ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి భరోసా ఇచ్చారు. ఈ నెల 16వ తేదీన వడగండ్ల వర్షం బీభత్సం సృష్టించడంతో ఖరీఫ్, రబీ సీజన్లలో సాగు చేసి దిగుబడులు చేతికందే తరుణంలో అన్నదాత తీవ్రంగా నష్టపోయారు. ఈ మేరకు ఆదివారం కోవెలకుంట్ల మండలంలోని అమడాల, సౌదరదిన్నె, పొట్టిపాడు, గుళ్లదూర్తి గ్రామాల పరిధిలో దెబ్బతిన్న వివిధ పంటలను వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి కర్రా హర్షవర్ధన్‌రెడ్డి, యువనాయకుడు కాటసాని ఓబులరెడ్డితో కలిసి ఎమ్మెల్యే కాటసాని పరిశీలించారు. మిరప పంటలో ఎకరాకు రూ. 2 లక్షల వరకు, వరి, మినుము, మొక్కజొన్న, తదితర పంటల్లో ఎకరాకు రూ. 30 వేల నుంచి రూ. 50 వేలు పెట్టుబడుల రూపంలో వెచ్చించగా అకాల వర్షం నట్టేట ముంచిందని బాధిత రైతులు ఎమ్మెల్యే ముందు తమ గోడు విన్నవించుకున్నారు. ఈ సందర్భంగా కాటసాని మాట్లాడుతూ వడగండ్ల వర్షంతో దెబ్బతిన్న ప్రతి ఎకరాకు నష్టపరిహారం చెల్లించేందుకు కృషి చేస్తామన్నారు. కోవెలకుంట్ల మండలంలో 3 వేల ఎకరాలు, సంజామల మండలంలో 2 వేల ఎకరాల్లో మిరప, మొక్కజొన్న, వరి తదితర పంటలకు నష్టం చేకూరినట్లు వ్యవసాయ, ఉద్యానవనశాఖ అధికారులు ప్రాథమిక అంచనా వేశారన్నారు. మిరప పంటలో పంట కోత ప్రయోగాలు పూర్తి కావడంతో పంటల బీమా వర్తించదని, ఈ విషయాన్ని ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి గ్రామ యూనిట్‌గా తీసుకుని బీమా సౌకర్యం కల్పించేందుకు తమవంతు కృషి చేస్తామన్నారు. ఆయా శాఖల అధికారులు రైతు భరోసా కేంద్రాల్లో పంటల నమోదు ఆధారంగా పంటనష్ట సర్వేను పకడ్బందీగా చేపట్టి రైతులకు నష్ట పరిహారం వర్తింపచేయాలని సూచించారు. కార్యక్రమంలో ఆయా గ్రామాల సర్పంచ్‌లు మధుసూదన్‌రెడ్డి, మద్దిలేటి, లోకేశ్వరరెడ్డి, మోహన్‌రెడ్డి, వైఎస్సార్‌సీపీ జిల్లా ప్రచార కార్యదర్శి సిద్ధంరెడ్డి రాంమోహన్‌రెడ్డి, మండల ఇన్‌చార్జ్ భీమిరెడ్డి ప్రతాప్‌రెడ్డి, మేజర్ గ్రామ పంచాయతీ ఉపసర్పంచ్ జీసీఆర్ సూర్యనారాయణ రెడ్డి, వైఎస్సార్‌సీపీ నాయకులు అమడాల శంకరయ్య, భాస్కర్‌రెడ్డి, వెంకటేశ్వరరెడ్డి, సంగం సుధాకర్‌రెడ్డి, శ్రీనివాసరెడ్డి, దస్తగిరిరెడ్డి, నాట్ల వెంకటేశ్వరరెడ్డి, ఎల్ఐసీ రామసుబ్బారెడ్డి, నాగార్జునరెడ్డి, వెంకటసుబ్బారెడ్డి, రుషికేశ్వరరెడ్డి, కరుణాకర్, చిక్కేపల్లి ప్రసాదరెడ్డి, గువ్వల రామకృష్ణారెడ్డి, ఏఓ నిరంజన్, ఉద్యానవనశాఖ అధికారిణి ధరణి, తహసీల్దార్ పుష్పకుమారి, ఇన్‌చార్జ్ ఎంపీడీఓ రాధిక, ట్రాన్స్‌కో ఏఈ రామసుబ్రహ్మణ్యం పాల్గొన్నారు.

ట్రాక్టర్ నడుపుతూ... పంటనష్టాన్ని పరిశీలిస్తూ...



పంట నష్టం జరిగిన పొలాలను పరిశీలించేందుకు ట్రాక్టర్‌పై వెళ్తున్న ఎమ్మెల్యే కాటసాని

కోవెలకుంట్ల: మండల పరిధిలోని అమడాల, సౌదరదిన్నె, పొట్టిపాడు, గుళ్లదూర్తి గ్రామాల్లో అకాల వర్షంతో నష్టపోయిన పంటలను ఆదివారం ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి వైఎస్సార్‌సీపీ నాయకులు, అధికారులతో కలిసి పరిశీలించారు. అయితే గుళ్లదూర్తి గ్రామంలో భారీగా జరిగిన మిరప పంటను పరిశీలించేందుకు ఇబ్బంది పడాల్సి వచ్చింది. దీంతో అప్పటికప్పుడు గ్రామస్తులు ట్రాక్టర ఏర్పాటు చేయగా ఎమ్మెల్యే స్వయంగా స్టీరింగ్ పట్టారు. ట్రాక్టర్ నడుపుతూ పంట నష్టం జరిగిన పొలాలను పరిశీలిస్తూ ముందుకు సాగారు. సుమారు 4 కిమీ ట్రాక్టర్ నడిపి దెబ్బతిన్న పంట పొలాలను పరిశీలించిన ఎమ్మెల్యే రైతులతో మాట్లాడి పంట నష్టం వివరాలపై ఆరా తీశారు. గ్రామంలో సుమారు 600 ఎకరాల్లో మిరప, 200 ఎకరాల్లో వరి, 50 ఎకరాల్లో మొక్కజొన్న పంటలు దెబ్బతిని భారీ నష్టం మిగిలిందని బాధిత రైతులు ఎమ్మెల్యే ముందు వాపోయారు. అధైర్యపడొద్దని, అన్ని విధాలా అదుకుంటామని కాటసాని హామీ ఇచ్చారు.

24న రాష్ట్రస్థాయి బండ లాగుడు పోటీలు

బేతంచెర్ల: మండలపరిధిలోని ఆర్ఎస్ రంగాపురం గ్రామంలో వెలసిన సుంకులా పరమేశ్వరీ దేవి ఆలయంలో ఉగాది పండుగను పురస్కరించుకొని ఈనెల 24న రాష్ట్రస్థాయి పాలపండ్ల బండలాగుడు పోటీలను నిర్వహిస్తున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. మొదటి, రెండవ, మూడవ, నాల్గవ, ఐదవ బహుమతులు వరుసగా రూ. 30 వేలు, రూ. 20 వేలు, రూ. 15 వేలు, రూ. 10 వేలు, రూ.5 వేలు చొప్పున అందజేస్తామన్నారు. పోటీలలో పాల్గొన దలచిన వృషభాల యాజమాన్యాలు 23వ తేదీ సాయంత్రం లోపు రూ.200 ఎంట్రీఫీజు చెల్లించి పేరు నమోదు చేయించుకోవాలని సూచించారు.

నేటి నుంచి ప్రత్యేక మొబైల్ ఆధార్ కేంద్రాలు

కొలిమిగుండ్ల: జిల్లా ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు మండలంలో సోమవారం నుంచి ప్రత్యేక మొబైల్ ఆధార్ కేంద్రాలు ఏర్పాటు చేస్తున్నట్లు ఎంపీడీఓ సుబ్బరాజు తెలిపారు. 20,21న చింతలాయిపల్లె, 27న అబ్దులాపురం, కోర్నపల్లె, 28న తోళ్లమడుగు, ఉమ్మాయిపల్లె, ఉమ్మాయిపల్లెతండా, 29న అంకిరెడ్డిపల్లెలో ఆధార్ సెంటర్లు నిర్వహిస్తున్నామన్నారు. గ్రామాల్లోని రైతు భరోసా కేంద్రాలు, గ్రామ సచివాలయాల వద్ద కేంద్రాలను నిర్వహిస్తామన్నారు. కొత్తగా ఆధార్ నమోదు, పేర్లు మార్పులు తదితర వాటి కోసం ఏర్పాటు చేస్తున్న మొబైల్ ఆధార్ కేంద్రాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఎంపీడీఓ సూచించారు.

క్రీడాకారులకు సంపూర్ణ సహకారం



విజేతలకు నగదుతో పాటు జ్ఞాపికను అందజేస్తున్న ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి, కాటసాని ఓబులరెడ్డి

బనగానపల్లెరూరల్: క్రీడాకారులకు తన సంపూర్ణసహకారం ఉంటుందని ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి అన్నారు. స్థానిక ప్రభుత్వ క్రీడా మైదానంలో ఎమ్మెల్యే కాటసాని పెద్ద కుమారుడు దివంగత కాటసాని నాగార్జునరెడ్డి చారిటుబల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న రాష్ట్రస్థాయి ఓపెన్ వాలీబాల్ టోర్నమెంట్ ఆదివారం సాయంత్రం ముగిశాయి. విజేతల బహుమతుల పంపిణీ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా ఎమ్మెల్యేతోపాటు ఆయన కుమారుడు, వైఎస్సార్‌సీపీ నేత ఓబులరెడ్డి హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ క్రీడాకారులకు మంచి గుర్తింపు ఉందని, విద్యతోపాటు ఆటలపై దృష్టి సారించాలని సూచించారు. క్రీడల అభివృద్ధికి అన్నివిధాలుగా సహకారం అందజేస్తామని ఓబులరెడ్డి హామీ ఇచ్చారు. ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాలను వరసగా చెన్నైకి చెందిన ఐరన్‌మాన్ టీం, బనగానపల్లెకు చెందిన ఇబ్రహీం టీం, గుంటూరుకు చెందిన తిరుపతి టీం కైవసం చేసుకున్నాయి. ఈ జట్లకు వరుసగా రూ.30వేలు, రూ.20వేలు, రూ.10వేలు చొప్పున నగదుతోపాటు జ్ఞాపికలను వారు అందజేశారు. కార్యక్రమంలో బనగానపల్లె సీనియర్ క్రికెట్ ప్లేయర్ మహమూద్, ఎస్ఐ రామిరెడ్డి, ఆర్గనైజర్స్ సుదర్శన్‌రెడ్డి, నీలి శివకృష్ణ, అత్తార్ అఖిల్, ఇబ్రహీం, పక్కీరయ్య, రాజు, ప్రసాద్,మాబాష, చోటు, వైఎస్సార్‌సీపీ నాయకులు రామసుబ్బారెడ్డి షరీఫ్, రమణ తదితరులు పాల్గొన్నారు.

ఇంటింటికీ కుళాయి పనుల పరిశీలన

డోన్ టౌన్/రూరల్: మండలంలోని జల్‌జీవన్ మిషన్ కింద సోంపురం, రేకులకుంట గ్రామాల్లో జరుగుతున్న ఇంటింటికీ తాగునీరు సరఫరా పనులపై సెంట్రల్ వాటర్ స్కీం టీం సభ్యులు నిర్మల్ చిత్తూరా, కుళదీప్‌కుమార్ బాద్యల్ సంతృప్తి వ్యక్తం చేశారు. ఆయా గ్రామాను సభ్యులు ఆదివారం సందర్శించి జేజేఎం పనులను పరిశీలించారు. ఆయా గ్రామాల ప్రజలతో సభ్యులు నిర్మల్ చిత్తూరా కుళదీప్‌కుమార్ బాద్యల్, జిల్లా ఇంజినీర్ మనోహర్ మాట్లాడి సంతృప్తి వ్యక్తం చేశారు. అనంతరం సోంపురం గ్రామంలో జరిగిన సమావేశానికి వారితో పాటు వాటర్ గ్రిడ్ డీఈ సోమశేఖర్, ఏఈలు బాలకృష్ణ, మధుకృష్ణ, మనోజ్‌రెడ్డి హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎంపీపీ రేగటి రాజశేఖర్‌రెడ్డి మాట్లాడుతూ ఇంటింటికీ పైప్‌లైన్ ఏర్పాటుకు జరుగుతున్న పనులను వివరించారు. మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్‌రెడ్డి ప్రత్యే చొరువతో ఇప్పటికే 90శాతం పనులు పూర్తయ్యాన్నారు. సోంపురం, రేకులకుంట గ్రామాల్లో వంద శాతం పనులు పూర్తవ్వడంపై అధికారులను అభినందించారు. సమావేశంలో మార్కెట్‌యార్డు మాజీ చైర్మన్ రామచంద్రుడు, సర్పంచ్ రాధమ్మ, వైఎస్సార్‌సీపీ నాయకులు వేమారెడ్డి, కౌన్సిలర్ దినేష్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.